COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

విజయవాడ,
**తేదీ : 21 ఏప్రిల్, 2017.**

**శ్రీయుత నారా చంద్రబాబునాయుడు గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం,
అమరావతి.

**ప్రచురణార్థం:** ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాను. – **జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

ఆర్యా!

విషయం : **ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలి. అడిగినవారందరికీ పనులు ఇవ్వాలి. యంత్రాలను నిషేధించి కూలీలతో పనులు చేపట్టాలి. ఉపాధి పనుల వద్ద అంబలి కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ...**

రాష్ట్రంలో తీవ్రమైన కరువు వున్న విషయం మీకు తెలుసు. పనులు లేక లక్షలాదిమంది వ్యవసాయ కూలీలు రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు కోస్తా జిల్లాల నుండి కూడా వలసలు పోతున్నారు. ఇంత పెద్ద ఎత్తున వలసలు పోతుంటే వీరంతా అదనపు ఆదాయం కోసమే పోతున్నారని చెప్పటం భావ్యంగాదు. చేసిన పనికి నెలల తరబడి బకాయిలు చెల్లించక పోవడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం మీద విశ్వాసం సన్నగిల్లింది. గ్రామాలలో ఉపాధిహామీ పనులు కల్పించడానికి నిర్దేశించిన చట్టం రాష్ట్రంలో ప్రక్కదారి పడుతున్నది. కూలీలతో పనులు చేయించకుండా కన్వర్షన్ పేరుతో నీరు–చెట్టు, సిమెంట్‌రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం లాంటి పనులకోసం ఉపాధి నిధులు మళ్ళిస్తున్నారు. వీటివల్ల కొంతమందికే పనులు దొరికి లక్షలాది మంది కూలీలలకు పనిదొరకడం లేదు.

గతంలో 60 శాతం నిధులు కూలీలకే ఖర్చు చేస్తే ప్రస్తుతం కొన్ని గ్రామాలలో 90 శాతం నిధులను మెటీరియల్ వర్కుకు కేటాయించడంతో కాంట్రాక్టర్ల జోక్యం, యంత్రాల వినియోగం పెరిగి అవినీతి భారీస్థాయిలో జరుగుతోంది. ఈ కారణంగా కూలీలకు పనిదినాలు తగ్గిపోతున్నాయి. గతంలో ఆ గ్రామంలో ఏ పనులు చేయాలో నిర్ణయించుకునే అధికారం గ్రామసభలకు, పంచాయితీలకు వుండేది. ప్రస్తుతం జన్మభూమి కమిటీలకు కట్టబెట్టడంతో పెత్తందారీ తనం పెరిగి పారదర్శకత దెబ్బతిన్నది. కూలీలు పనులు కావాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా కోరినవారందరికీ పనులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైంది. పనిచేసిన 15 రోజులలోపు కూలీ చెల్లించాలని చట్టం చెబుతుంటే నెలల తరబడి కూలీ చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాపితంగా సుమారు 550 కోట్ల రూపాయల పైనే బకాయిలు వున్నట్లు తెలుస్తోంది. అంతే కాకుండా వేతనాలు పోస్టాఫీసుల నుండి బ్యాంకులకు అనుసంధానం చేయడంవల్ల వచ్చిన కొద్దిపాటి కూలీని కూడా బ్యాంకులు డ్వాక్రా, రైతు రుణాలు ప్రభుత్వం చెల్లించని పాత అప్పులకు జమచేసుకుంటున్నారు. దీనివల్ల కూలీలకు తీరని అన్యాయం జరుగుతోంది. కేంద్రం నిర్ణయించిన ఆర్ఆర్ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం రోజుకూలీ రూ.197 రావాల్సి వుండగా అనేక జిల్లాల్లో 60,70 రూపాయలు కూడా రావటంలేదు. రాష్ట్రంలో ఎండలు తీవ్రంగా వున్నాయి. నేల గట్టిగా మారి ఎంతపనిచేసినా కూలి గిట్టు బాటు కావడంలేదు. పనులకు వెళ్ళి వడదెబ్బలకు గురి అయి అనేక మంది చనిపోతున్నారు.

ఉపాధి పనులు చేపట్టి వలసలు నివారించడానికి అన్ని గ్రామాలలో పనులు ఇవ్వాలి. పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలి. బ్యాంకులు ఉపాధిబకాయిలను పాత అప్పులకు జమచేసుకోకుండా చూడాలి. పనిచేసే చోట అంబలి కేంద్రాలు, మంచినీటి సౌకర్యం కల్పించాలి. సమ్మర్ అలవెన్స్ 50 శాతానికి పెంచాలి, టెంట్‌లు వెంటనే పంపిణీ చేయాలి. పై చర్యలు తీసుకొని ఉపాధి చట్టం లక్ష్యం కాపాడాలని కోరుతున్నాను.

**అభివందనములతో...**

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి